గ్రామాల్లో దాహం కేకలు



తోకలాసేరులో గెడ్డ నీటిని సేకరిస్తున్న గ్రామ మహిళలు



పితమర్రిగుడలో కుండి నుంచి కలుషిత నీటిని సేకరిస్తున్న మహిళలు

- గిరిజనులకు తప్పని తాగునీటి కష్టాలు
- బోరు తీశారు.. మోటారు అమర్చడం మరిచారు
- తూటంగి, సాగర పంచాయతీ వాసులకు కలుషిత నీరే శరణ్యం
- పట్టించుకోని అధికారులు

డుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ తోకలాసేరు, కురిడి పంచాయతీ పితమర్రిగుడ గ్రామాలకు తాగునీటి సమస్య వేధిస్తోంది.ఆయా ప్రాంతాల్లో తాగునీటి సదుపాయం లేక స్థానికులకు కలుషిత నీరే శరణ్యమవుతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంల ద్వారా జల్ జీవన్ మిషన్.. హర్ ఘర్ జల్ పథకం ద్వారా రూ.7.50లక్షలతో పనులు చేశారు. కాంట్రాక్టర్ బోరు తీసి మోటారు అమర్చకుండ వదిలేశారు. జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభించినా నేటికి పనులు పూర్తి కాలేదు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని గాలికి వదిలేసింది. దీంతో ఆయా ప్రాంతవాసులకు తాగునీరు కష్టాలు తప్పడం లేదు. మరో గత్యంతరం లేక కొండ కాలువ నుంచి వచ్చే కలుషిత నీరుని సేకరించి గ్రామలకు వచ్చేలా ఒక పైపు, ట్యాప్ అమర్చి ఆ నీటిని తాగుతున్నారు. ఈ నీటిని వినియోగించడంతో రోగాల బారినపడుతున్నామని గ్రామస్తులు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రజకు తాగునీరు కల్పించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలక్షలాది రూపాయిలు వెచ్చించింది. అయితే నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్



నిరుపయోగంగా కుళాయి

మాత్రం తూతూ మంత్రంగా పనులు చేపట్టి వదిలేశారని, అధికారులకు కూడా పట్టించుకోకపోవడంతో తాగునీటి కోసం అల్లాడుతున్నామంటున్నారు. తోకలాసేరు గ్రామంలో జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మాణం పనులు పూర్తి చేయకుండా వదిలేసి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నా ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉన్నతాధికారులు స్పందించక పోవడంతో తమ గ్రామానికి తాగునీరు కష్టాలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. కురిడి పంచాయతీ పితమర్రిగుడ గ్రామంలో తాగునీరు బోరుతో పాటు బావి మరమ్మతుకు గురికావడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటరు దూరంలో ఉన్న ఆంధ్ర–ఒడిశా రాష్ట్రం సరిహద్దు చటావా గ్రామ సమీపంలో ఉన్న కలుషితమైన కుండీ నుంచి నిల్వ నీరు తీసుకొని వినియోగిస్తున్నామని చెబుతున్నారు. దీంతో గ్రామంలోని చిన్నారులు, వృద్ధులు తరచూ రోగాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా తాగునీరు సేకరించే క్రమంలో ఇరుపైపులా రోడ్డు మార్గం ఉండడంతో ఏప్పుడు ఏ ప్రమాదం జరగుతుంతుందొన్న భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే పితమర్రిగులో తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరతున్నారు.



తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

కష్టాలు వర్ణనాతీతం

మండలంలోని తాగునీటికి గిరిజనులు ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. తాగునీటి కోసం గిరిజనులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. అధికారులు స్పందించి గిరిజన గ్రామాలకు తాగునీరు సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించాలి. లేకపోతే గిరిజనుల దాహార్తికి అడ్డుకట్ట లేకుండా పోతుంది.



– టి.సూర్యనారాయణ, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, డుంబ్రిగుడ మండలం

ప్రతిపాదనలకు ఆదేశించాం

గ్రామాలలో తాగునీరు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ద్వారా గ్రామాల్లో తాగునీరు ఎద్దడికి ప్రత్యేకించి ప్రతిపాదన రుపొందించాలని ఆదేశించాం. వారంలో తాగునీరు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎస్.వి.వి.నరసింహమూర్తి, ఇన్‌చార్జి ఎంపీడీవో, డుంబ్రిగుడ మండలం



హెడ్ లేని బోరు ఇదే

క్లుప్తంగా

భవానీ మాలధారుల పాదయాత్ర



ఇంద్రకీలాద్రికి పాదయాత్రగా వెళ్తున్న భవానీమాలధారులు

గంగవరం: భవానీ మాల ధారులు పెదగార్లపాడు గ్రామ నుంచి విజయవాడకు పాదయాత్ర ప్రారంభించారు. మండలం కేంద్రం నుండి ఆదివారం భారీగా భవానీ భక్తులు విజయవాడ తరలివెళ్లారు. పెద్దగార్లపాడు, చిన్నగార్లపాడు, దొరవమామిడి, నెల్లిపూడి, చిన్నంపాలెం, జియ్యంపాలెం, ఓ.జి.బంద గ్రామాల్లో దసరా శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో భారీ సంఖ్యలో భవాని మాలధారులు, భక్తులు అమ్మవారికి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి ఆధార్ డ్రైవ్



ఎంపీడీవో, యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి సచివాలయం వద్ద ఈ నెల 29, 30, అక్టోబర్ ఒకటవ తేదీల్లో మొబైల్ ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు తెలిపారు. ఆధార్ కార్డు లేని వారు, ఆధార్ అప్‌డేట్, ఆధార్‌తో ఫోన్ నంబర్ లింక్ చేయాలను కొనేవారు నేరుగా వచ్చి ఈ సేవలు పొందవచ్చన్నారు. అలాగే ఆధార్‌లో వివరాల మార్పుచేర్పులు వంటి సేవలు అందిస్తున్నామని, ఈ ఆధార్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

150 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైద్యులు

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల, కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలోని బహుళ విభాగాల పరిశోధన కేంద్రం, కాకినాడ జీజీహెచ్ ఆధ్వర్యంలో ఆదివారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్య శిబిరంలో కళాశాల ప్రొఫెసర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఆర్.రాజ్యలక్ష్మి మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, ఇతర క్యాన్సర్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. సుమారు 150 మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. డాక్టర్ కావ్య, సునంద, త్వేషాపాండా తదతరులు వైద్య సేవలందించారు. ఆర్‌కె మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేనందజీ మహారాజ్ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు.

టీటీడీ ఆలయాన్ని దర్శించుకున్న ఆర్‌ఎంసీ కమిషనర్



ఆలయాన్ని సందర్శించిన కమిషనర్, కుటుంబసభ్యులు

రంపచోడవరం: మండలంలోని ఐ.పోలవరం వద్ద ఉన్న తిరుమల తిరుపతి ఆలయాన్ని రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ రామలింగేశ్వర్ కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా స్వాగతం పలికారు. ఆయన స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి



భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన రాజాన దొరబాబు

అనకాపల్లి: స్వాతంత్య్ర సమరయోధుడు భగత్ సింగ్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు కోరారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో భగత్‌సింగ్ 118 జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ 23 సంవత్సరాల వయస్సులో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవ ఉద్యమం నడిపిన ధైర్యశాలి, సమసమాజ స్థాపన నా లక్ష్యం అని ప్రకటించిన మేధావి ఆయనకే దక్కిందన్నారు. నేటి పాలకులు అమలు చేస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అల్యూమినియం వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బుద్ద భద్రారావు, సభ్యులు కొండూరు వీరాచారి, కె.శ్రీను, గిరి, శ్యామ్, విత్తనాల పోతురాజు, సూరిబాబు పాల్గొన్నారు.

తాగునీటి పథకం ప్రారంభం



వెంకన్నగూడెంలో వాటర్‌ట్యాంకు ప్రారంభిస్తున్న సర్పంచ్ అభిరామ్

కూనవరం: వెంకన్నగూడెం గ్రామస్తులు రక్షిత తాగునీటి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాయం రంగమ్మ, సర్పంచ్ సున్నం అభిరామ్ అన్నారు. మండలంలోని చినార్కూరు పంచాయతీ పరిధి వెంకన్నగూడెం గ్రామంలో నిర్మించిన రక్షిత తాగునీటి పథకాన్ని ఆదివారం సర్పంచ్ సున్నం అభిరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చినార్కూరు పంచాయతీ నిధులను గ్రామాభివృద్ధికే వెచ్చిస్తున్నామన్నారు. కార్యదర్శి రోజ, పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శి దారయ్య, కుంజా అనిల్, బొడ్డు రమేష్, వార్డు సభ్యులు రాజమ్మ, గ్రామస్తులు కన్నమ్మ, కారంచంద్రయ్య, దాసు, కృష్ణమూర్తి, అన్నపూర్ణమ గంగరాజు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై ఫిర్యాదు

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురంలో ద్విచక్ర వాహనం చోరీపై మునగపాక పోలీసులకు ఆదివారం బాధితుడు అరసవిల్లి కృష్ణ ఫిర్యాదు చేశాడు. పల్లపు ఆనందపురంలో నివాసం ఉంటున్న కృష్ణ శనివారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఆవరణలో ఉంచాడు. ఆదివారం తెల్లవారు లేచి చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన ఆయన మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

5న దసరా ఉత్సవ మహాసభ

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో వచ్చే నెల 5న దసరా ఉత్సవ మహాసభను నిర్వహించాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు నిర్ణయించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతినిధులు ఆదివారం గ్రామ పెద్దలను కలిసి ఆహ్వాన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు రామకోటి పరమేశు, చిరంజీవి రాజు, జెర్రిపోతుల నూకినాయుడు, కోన లక్ష్మి, గేదెల శేషుబాబు, గేదెల నానాజీ, కోన రవీంద్రనాయుడు, మారిశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నసమారాధనలు, వైద్య పరీక్షలు



అన్న సమరాధనలో భక్తులు



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు విజయ్,అంజనాయక్

కొయ్యూరు: దుర్గమ్మ నవరాత్రుల సందర్భంగా ఆదివారం కొయ్యూరులో భారీ అన్నసమరాధన కార్యక్రమం నిర్వహించారు. మరోవైపు కాకినాడ జిల్లా పత్తిపాడుకు చెందిన దేవర్ష ఆస్పత్రి వైద్యులు డి.విజయ, బి.అంజనాయక్‌లు వైద్య శిబిరం నిర్వహించారు. అధిక సంఖ్యలో రోగులు వచ్చారు. ఆదివారం సంత కావడంతో దాదాపుగా 80 గ్రామాలకు చెందిన గిరిజనులు వస్తారు. అన్నసమరాధనతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎక్కువ సంఖ్యలో రోగులకు చికిత్సలు చేసి మందులు ఇచ్చారు. ఆలయ ధర్మకర్త ఎం.వి.ఎస్.ప్రసాద్, సర్పంచ్ బాలరాజు, సభ్యులు చక్రరావు, చిరంజీవి, బాబు, దేవుడు,అశోక్, నాగేశ్వరరావు, రాజేశ్, ధనుష్, బద్రి, బూర్గలయ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

ముంచంగిపుట్టు: భవన నిర్మాణ కార్మికులు ఐక్యతగా ఉండాలని వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికులు సమావేశమయ్యారు. కార్మికుల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. భవిష్యత్తు కార్యచరణను రూపొందించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం గృహాలు మంజూరు చేసి, నిర్మించి ఇవ్వాలని, కార్మికులందరికి రూ.20లక్షలు చొప్పున్న ప్రమాద బీమాలు చేయించాలన్నారు. గిరిజన ప్రాంత భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం నిర్మించే భవనాల పనుల్లో అవకాశం కల్పించాలని, మైదాన ప్రాంత కార్మికులతో ఇక్కడి భవనాలు నిర్మించడం తగదని,



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ

దీని వల్ల గిరిజన మేస్త్రీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఉపాధి అవకాశాలు దెబ్బతీంటున్నాయని, గిరిజన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సర్పంచ్ బాబూరావు, భవన నిర్మాణ కార్మికుల యూనియన్ సభ్యులు రవికుమార్, నర్సింగ్, కొములు, శరత్, సాధురాం తదితరులు పాల్గొన్నారు.

కానరాని అంబులెన్స్ సేవలు... తప్పని అవస్థలు

పెదబయలు: మండలంలోని గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ లేక అవస్థలు పడుతున్నామని అధికారులు స్పందించి అంబులెన్స్ వినియోగంలోకి తీసుకుని రావాలని గోమంగి ప్రజలు కోరుతున్నారు. ఈ నెల 27న సాయంత్రం ఐదు గంటల సమయంలో గోమంగి మినీ గురుకులం పాఠశాల ఉపాధ్యాయుడు కొంతేరి సింహాచలం కాలుజారి కిందపడడంతో కాలు విరిగింది. ఆయనను స్థానిక గోమంగి పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అందించి అనంతరం మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించేందుకు ఇక్కడి అంబులెన్స్ మరమ్మతుకు గురై షెడ్డుకు పరిమితమైంది. ఈ నేపథ్యంలో సదరు ఉపాధ్యాయుడి కుటుంబీకులు సాయంత్రం ఆరు గంటలకు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా రాత్రి 10గంటలకు గోమంగి వచ్చిందని చెప్పారు. అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్ ఆలస్యంగా వస్తే



కాలు విరిగిన ఉపాధ్యాయుడిని తరలించడానికి గోమంగి గ్రామానికి రాత్రి చేరిన 108 వాహనం

ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ అంబులెన్స్ ఉంటే అత్యవసర పరిస్థితిలో పీహెచ్‌సీ పరిధిలోని రోగులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గోమంగి పీహెచ్‌సీ అంబులెన్స్ వినియోగంలోకి తేవాలని గోమంగి మండల సాధన సమితి నాయకులు అనంత పద్మనాభం, బాలరాజు, మహేష్, ధనుంజయ్, రవి తదితరులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సందడి



అధ్యాపకులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

అనకాపల్లి టౌన్: ఏరా.. ఎలా ఉన్నావు? ఏమి చేస్తున్నావు.. అంటూ ఆత్మీయ పలకరింపులతో పూర్వ విద్యార్థులంతా సందడి చేశారు. కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల వేదిగా ఆదివారం కలుసుకున్న వీరంతా ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇక్కడ 1996–99 సంవత్సరంలో చదివిన డిగ్రీ బ్యాచ్ విద్యార్థుల సమావేశం ఆదివారం సందడిగా జరిగింది. 25 సంవత్సరాల తర్వాత కలుసుకుని తమకు విద్యను బోధించిన అధ్యాపకులను ఆహ్వానించి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన అధ్యాపకులు పప్పల ఆదినారాయణ, మారేశ్వరరావు, అశోక్ కుమార్, నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి నైతిక విలువలు బోధించాలన్నారు. ప్రస్తుత సమాజంలో స్పీడ్ విద్యా విధానం పెరగడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత, నైతిన విలువలు లోపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి విద్యార్థులకు దేశభక్తి, నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యత తెలియజేయాలన్నారు.

విస్తృతంగా తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న సీఐ శ్రీనివాసరావు

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు రాకపోకలపై ప్రత్యేక దృష్టి పెట్టామని జి.మాగుడుల సీఐ శ్రీనివాసరావు అన్నారు.మండల కేంద్రంలోని సీఐ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులు లగేజీలను సోదా చేశారు. అనుమానం కలిగిన వ్యక్తులను ప్రశ్నించి విడిచిపెట్టారు. సీఆర్‌పీఎఫ్ పోలీసు బలగాలు సైతం మండల కేంద్రంలో గస్తీని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మావోయిస్టుల వారోత్సవాల్లో భాగంగా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సోదాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యలయాలు వద్ద సైతం రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేయడం, జోలాపుట్టు, డొడిపుట్టు నైట్ హాల్ట్ బస్సులను మండల కేంద్రంలోనే నిలుపుదల చేస్తున్నామన్నారు. ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్, పోలీసులు పాల్గొన్నారు.

సేవగరిడీ దాసులకు సత్కారం



సేవగరిడీ దాసులను సత్కరిస్తున్న గ్రామస్తులు

మునగపాక: నాగులాపల్లిలో సేవగరిడీ దాసులకు ఘన సత్కారం నిర్వహించారు. గ్రామంలోని పొలమరశెట్టి సేవగరిడీ తోడపెద్దు అచ్చుపోతలో భాగంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన 32 సేవగరిడీల దాసులను ఆదివారం స్థానికులు ఘనంగా సత్కరించారు. తోడపెద్దును పొలమరశెట్టి సూర్యనారాయణ దంపతులు కొనుగోలు చేసి కమిటీకి అప్పగించారు. మూల దాసుడు పొలమరశెట్టి సంతోష్, స్థానికులు ఉమామహేశ్వరరావు, శెట్టి నూకాలయ్య, నాగప్పారావు, జగన్ హరి, అప్పలనాయుడు, కాలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బోనాల జాతర



బోనాలు ఊరేగిస్తున్న భక్తులు

నక్కపల్లి: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉపమాకలో దుర్గాభవానీ పీఠం ఆధ్వర్యంలో బోనాల జాతర కనులపండువగా సాగింది. వందల సంఖ్యలో భవానీ దీక్షాపరులు, భక్తులు తరలివచ్చారు. మహిళలు అమ్మవారి బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపు చేశారు. ఉపమాక దుర్గాభవానీ గురు భవానీలు దవరసింగి రాంబాబు, కొప్పిశెట్టి సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన బోనాల సంబరం ఆద్యంతం భక్తులను పులకింపచేసింది. అనంతరం ఉపమాక కామాక్షి ఆలయం వద్ద బోనాలను సమర్పించారు. తదుపరి దుర్గాభవానీ పీఠం వద్ద వందలాది మందికి అన్నప్రసాదాలు పంచిపెట్టారు.

అన్నవరంలో తీరిన తాగునీటి సమస్య

సాక్షి ఎఫెక్ట్..

చింతపల్లి: అన్నవరం పంచాయతీ కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. 'అన్నవరంలో దాహం కేకలు' అన్న శీర్షకన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. అన్నవరంలో ఉన్నటువంటి తాగునీటి పథకంతో పాటు గ్రామంలో ఉన్నటు వంటి బోరు, బావి మరమ్మతులు గురికారవడంతో మెయిన్‌రోడ్డు, మోహన్‌రావు వీధి, చేతుడువీధిలో తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. శనివారం అన్నవరంలో ఆయా వీధుల్లో పాడైన బోర్లకు మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోనికి తీసుకువచ్చారు. దీంతో ప్రస్తుతం తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలోని తాగునీటి పథకాన్ని త్వరలో వినియోగంలోనికి తీసుకువచ్చి కుళాయిల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని ఏఈ స్వర్ణలత తెలిపారు. తాగునీటి సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కరించిన 'సాక్షి'కి, తక్షణమే స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



అన్నవరం మెయిన్‌రోడ్డులో మరమ్మతులు చేసిన బోరు వద్ద మహిళలు

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి



కిల్లో రామన్న

అరకులోయటౌన్: మండలంలోని ప్రతీ గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి గిరిజనులకు వైద్య సేవలు అందించాలని అరకులోయ వైస్ ఎంపీపీ కిల్లో రామన్న తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గత కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మరికి కాలువల్లో దోమలు పెరిగిపోవడంతో వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. దీంతో మండలంలో ఏ ఇంటా చూసిన జ్వరాలతో బాధ పడుతున్నారన్నారు. చాలా మంది రోగులు స్థానిక పీహెచ్‌సీలకు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారన్నారు. వ్యాధి తీవ్రత పెరిగిన వారంతా వ్యయ, ప్రయాసాలతో మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారంతా వ్యాధులతో బాధ పడుతూ ఇంటి వద్దే మగ్గుతున్నారన్నారు. నిర్లక్ష్యం చేస్తే అనేక మంది ప్రాణాలు కొల్పొయే ప్రమాదం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం, జిల్లా వైద్యారోగ్య ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి గిరి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళాలు

మునగపాక: కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు మునగపాకలో చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తూ ఆలయ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. ఆదివారం మునగపాకకు చెందిన శరగడం రాము, సునీత దంపతులు రూ.70 వేలు విరాళంగా అందజేశారు. నాగులాపల్లికి చెందిన పెంటకోట వేంకట రత్నంనాయుడు, భారతి దంపతులు రూ.50,116, మునగపాకకు చెందిన బొడ్డేడ మోహనరావు, జ్యోతి దంపతులు రూ.5,116 విరాళంగా అందజేశారు. డాక్టర్ సూర్యనారాయణ, ముసిలినాయుడు, రాము, జగ్గారావు, సత్యనారాయణ, సత్యనారాయణ(నానబ్బాయి), నాయుడు, ఉమేష్, రామునాయుడు, శ్రీనివాసరావు, ఆది విష్ణు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న రాము